క్లుప్తంగా

నృత్యంలో విద్యార్థుల ప్రతిభ



ఎర్రవల్లిచరస్తా: భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన బృంద నృత్య ప్రదర్శనలో ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన నటరాజ నాట్య వసంతం అకాడమీ చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి డాన్స్ లెసన్ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో భాగంగా గచ్చిబౌలి స్టేడియంలో నటరాజ నాట్య వసంతం అకాడమి చిన్నారులు గాయిత్రి, నిత్యారెడ్డి, కీర్తిసోనియా, యస్విత, వివి వ్యాస, యక్షిత, నయన, రిషితారెడ్డి, నిహారిక, దివ్య, ప్రీతి, సిరిచందన, సుమంజలి, తదితరులు పాల్గొని తమ నృత్యాలతో ఉత్తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉత్తమ ప్రతిభా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. చిన్నారులను నటరాజ నాట్య మండలి నిర్వాహకురాలు జ్యోతి, చిన్నారుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

వివేకానంద నూతన కమిటీ ఎన్నిక



అలంపూర్: వివేకానంద యూత్ సొసైటీ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన కమిటీ అధ్యక్షుడు రజినీబాబు తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటీలోని వెంకటేశ్వర కాన్వెంట్‌లో వివేకానంద యూత్ సొసైటీ సమావేశం సోమవారం నిర్వహించినటుల తెలిపారు. అధ్యక్షుడుగా రజినీబాబు, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా రంగస్వామి, సహాయ కార్యదర్శిగా భరత్, కోశాధికారిగా ముస్తఫా, ప్రచార కార్యదర్శిగా కరుణిందర్, సమన్వయ కార్యదర్శిగా శరత్, సాంస్కృతిక కార్యదర్శిగా కామాక్షి, గౌరవ అధ్యక్షులుగా పోలీస్ చిన్నయ్య, బుజ్జి యాదవ్, గౌరవ సలహాదారులుగా జూటూరి ప్రసాద్, దాసరి శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

పందులకు స్వైన్ ఫీవర్ టీకాలు



శాంతినగర్: వడ్డేపల్లి పట్టణంలో సంచరించే పందులకు స్వైన్ ఫీవర్ టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు డాక్టర్ పుష్పలత తెలిపారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో సోమవారం 260 పందులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో పెంచుతున్న పందులకు టీకాలు వేయించాలని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది షేక్ లతీఫ్, రవికిరణ్, ఓఎస్‌లు పాల్గొన్నారు.

ఇప్పుడైనా పట్టించుకుంటారా..?



గద్వాల అర్బన్: నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు తిరిగే జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో కొద్ది నెలలుగా రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్ గుంత నోరెళ్లబెట్టింది. అయినప్పటికీ వాటిని మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సోమవారం ఓ కారు టైరు కుడి భాగం మ్యాన్‌హోల్ గుంతలో పడింది. స్థానికులు సహాయంతో ఆ కారును వెనక్కుతోసి బయటకు తీశారు. ప్రమాదకరంగా రోడ్డు మధ్యలోనే ఇలా మ్యాన్‌హోల్ గుంత ఉండడం.. వాటిని పట్టించుకోకుండా చూసిచూడనట్లు వదిలేయడం అధికారులు పనితీరుకు నిదర్శంగా మారింది. ఇప్పుడైనా మ్యాన్‌హోల్ మూసేందుకు చర్యలు తీసుకుంటారా? లేక తమకేమీ పట్టనట్లు వదిలేస్తారా ? అనేది చూడాలని పలువురు పేర్కొన్నారు.

మామిడి రైతులకు అవగాహన సదస్సు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని రైతులకు మామిడి తోటల సాగుపై అవగాహన కల్పించేందుకు మంగళవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు మన గ్రోమోర్, పెబ్బేరు సెంటర్ మేనేజర్ సుబ్బారాయుడు, మామిడి తోటల రైతు ట్యూషన్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మదనాపూరం కేవీకే హార్టికల్చర్ శాస్త్రవేత్త సురేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- వీధుల్లో క్రైస్తవుల ర్యాలీలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- క్రిష్టియన్లకు దుస్తుల పంపిణీ
- పీహెచ్‌సీలో రోగులకు పండ్లు అందజేత



చింతలకుంట చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రిష్టియన్లు..

అలంపూర్/గట్టు: గట్టుమండలంలో, ఆయా గ్రామాల్లోని చర్చిలలో క్రైస్తవులు, మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బల్గెరలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, గొర్లఖాన్‌దొడ్డి, జడ్పీవైస్‌పర్సన్ సరితలు క్రిసమస్ వేడుకల్లో పాల్గొన్నారు. చర్చిల వద్ద చిన్నారుల నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఎంపీపీ విజయ్‌కుమార్, జడ్పీటీసీ శ్యామల, వైస్ఎంపీపీ, సింగిల్‌విండో అధ్యక్షుడు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

అలంపూర్ నియోజకవర్గంలో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. క్రిస్మస్ ట్రీలు, స్టార్లతో ఇళ్లు, చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. క్రైస్తవ సోదరులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు ప్రభువు పుట్టిన రోజు సందర్భంగా అనేక గ్రామాల్లో కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. పలువురు పేదలకు దుస్తులు బహూకరించి పండగ ప్రత్యేకతను చాటి చెప్పారు. గ్రామాల్లో ఆట-పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అలంపూర్ పట్టణంలోని సంతమార్కెట్ కాలనీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సేవకులు రాఘవేంద్ర, సంఘ పెద్దలు ఎం. ఏసేపు, ప్రేమదాసు, కే. ఏసేపులు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పల్లవి వాటర్ ప్యూరిఫైర్ వారి సహకారంతో జిల్లా కేంద్రంలోని లైఫ్‌చేంజ్ ఫౌండేషన్ ఫౌండర్ పరశురాముడు నిరుపేదలకు దుస్తులు, దుప్పట్లు, టవల్స్‌ను పంపిణీ చేశారు.

క్రిస్మస్ గిఫ్టుల అందజేత

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రెండో రైల్వేగేటు కాలనీలో న్యాయవాది వరలక్ష్మీదేవి పేద పిల్లలకు క్రిస్మస్ గిఫ్టును పంపిణీ చేశారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో క్రిస్టియన్లు సంబరాలు ఘనంగా నిర్వహించారు. వివిధ చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 2009 బ్యాచ్ విద్యార్థులు క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

మల్దకల్: మండలంలో, ఆయా గ్రామాల్లో క్రైస్తవులు, మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎ ల్కూరు, అమరవాయిలో చిన్నారుల నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఎంపీపీ రాజారెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ఎంపీపీ పెద్ద వీరన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వివిధ పార్టీల నాయకులు క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ధరూరు: ఏసు క్రీస్తు మార్గంలో ప్రతి క్రైస్తవుడు నడవాలని ఆయా చర్చిల పాస్టర్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చి, హోసన్నా మందిరం, మరనాథ విశ్వాస సమాజ మందిరం, బాప్టిస్టు చర్చి, గుత్తి చర్చి, మార్లబీడు హెబ్రోను చర్చిల్లో క్రిస్మస్ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రసాద్, ప్రభాకర్, అబ్రహం, కృపరాజ్, అంద్రూస్‌లు బైబిల్ ఆధారంగా క్రీస్తు జనన సందేశం వినిపించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

క్రీస్తు జననంపై ర్యాలీ..

ఏసుక్రీస్తు పుట్టిన రోజును పురస్కరించుకొని క్రైస్తవులు సోమవారం తెల్లవారు జామున ర్యాలీలు నిర్వహించారు. పుర వీధులగుండా పాటలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. శాంటాక్లాజ్ గ్రామంలో చాక్లెట్లు పంచుతూ సందడి చేశారు. మండలంలోని మన్నాపురం, సోంపురం, రేవులపల్లి, చింతరేవుల, మార్లబీడు, ర్యాలంపాడులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రసాద్, సంఘ యూత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని బ్రదరన్ చర్చిలో, క్రీస్తు సంఘం చర్చిలో, హోసన్నా మందిరంతో పాటు మండలంలోని కేటీదొడ్డి, సోంపురం, గువ్వలదిన్నె, నందిన్నె, కుచినెర్ల, మల్లాపురం, చింతలకుంట, కొండాపురం, ఉమిత్యాల, ఇర్కిచేడు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు క్రిస్మస్ చర్చిల్లో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులందరూ క్రీస్తు సూచన మార్గంలో నడవాలని దయ, జాలి, కనికరం, ప్రేమ, శాంతి, కలిగిఉండాలని పొరుగువారిని ప్రేమించాలని పాస్టర్ సురేష్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దలు అబ్రహం, సంసోన్, మార్క్‌డేవిడ్, తిమోతి, లాజర్, ఉజురప్ప, దేవదాసు, ముక్కిరప్ప పాల్గొన్నారు.



అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

శాంతిమార్గంలో పయనించాలి

- ఎమ్మెల్యే విజయుడు



షాబాద్‌లో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి ఒక్కరూ ఏసు ప్రభువు చూపిన శాంతి మార్గంలో పయనించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని షాబాద్ గ్రామ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన హాజరై కేక్ కట్‌చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మానవాళిలో ఆనందం నింపిన యేసు క్రీస్తు జీవితం అందరికీ ఎంతో ఆదర్శప్రాయం అన్నారు. ప్రతి ఒక్కరి కుటుంబంలో మేలు జరగడంతో పాటు ప్రజలంతా ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ప్రార్థించి వేడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పాస్టర్లు, సంఘ పెద్దలు ఉన్నారు.



బల్గెర చర్చిలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను క్రీస్తు సోదరులు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉండవెల్లి: మండల కేంద్రం, తక్కశిల, చిన్న ఆముదాలపాడు, కంచుపాడు, గ్రామాల్లో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తక్కశిల చర్చిలో చిన్నారుల ఆటపాటలతో అలరించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మేరి, శాంతాక్లాస్ వేషధారణలో అలరించారు. చిన్నారులు ఆటపాటలతో అలరించారు.

మానవపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు, ఏసుక్రీస్తు జననం, మరణంపై నృత్యరూపం ప్రదర్శించారు. కార్యక్రమంలో దుబ్బన్న, అరుణ్‌కుమార్, చిన్నకుర్మన్న, జయ్యన్న, యుగంధర్, చంద్రబాబు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



అలంపూర్‌లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థన



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న యువకులు



గద్వాలలో పిల్లలకు క్రిస్మస్ గిఫ్టుల పంపిణీ



ఎర్రవల్లిలో కేక్‌కట్ చేస్తున్న మహిళలు



అయిజలో బహుమతులు అందిస్తున్న పాస్టర్లు



తక్కశిలలో పాటలు పాడుతున్న చిన్నారులు

మనుధర్మశాస్త్ర ప్రతుల దహనం



ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: అట్టడుగు వర్గాలకు మనుధర్మశాస్త్రం ఆటంకంగా మారిందని పేర్కొంటూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మనుధర్మశాస్త్ర ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుధర్మసం దేశానికి ప్రమాదకరంగా మారిందన్నారు. 1927 డిసెంబర్ 25న అంబేద్కర్ మనుధర్మశాస్త్ర ప్రతులను దహనం చేశారని గుర్తు చేశారు. దేశంలో నేడు బీజేపీ ప్రభుత్వం అవే విధానాలను అమలు చేయడం ద్వారా దేశ ప్రజలకు ప్రమాదకరంగా మా రిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజానీకానికి సమాన హక్కులు పంచిన భారత రాజ్యాంగం గొప్ప దన్నారు. కా ర్యక్రమంలో బహుజన రాజ్యసమితి అధ్యక్షుడు వాల్మీకి, నాయకులు వినోద్ కుమార్, కేఎన్‌పీఎస్ అధ్యక్షుడు రవికుమార్, దళిత ఐక్య వేది క అధ్యక్షుడు మోహన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దాన య్య, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నా యకులు ఉన్నారు.

క్రీడాకారులకు సన్మానం



గద్వాల అర్బన్: ఇటీవల హన్మకొండ జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ స్టేట్ లెవల్ అండర్-17బాలుర కబడ్డీ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు తరుపున జిల్లాలోని రేవులపల్లికి చెందిన అక్షయ్ కుమార్, అయిజకు చెందిన పరశురాముడు ఆడారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో అక్షయ్, పరశురాముడులకు డీవైఎస్‌ఓ ఆనంద్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్‌లు శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, కబడ్డీ కోచ్ రజినీ కాంత్ పీఈటీలు రవి, సూర్యచంద్ర ఉన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి ఆదర్శనేత



గద్వాలలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళి

గద్వాల: మాజీ ప్రధాని వాజ్‌పేయి గొప్ప ఆదర్శ నేత అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రామంజనేయులు కొనియాడారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు, బాలసదనం విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండల వెంకట్రాములు, కుమ్మరి శ్రీనివాసులు, త్యాగరాజు, జయశ్రీ, నర్సింహ, అనిల్, రాజుయాదవ్, పాండు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

అయిజ: వాజ్‌పాయ్ 99వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 106 మంది యువకులు రక్తదానం చేశారు. ఎక్కువసార్లు రక్తదానం చేసిన యువకులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఇండియన్‌రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు తాహేర్, బీజేపీ కార్యకర్తలు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, పట్టణ యువకులు పాల్గొన్నారు.

నిరుపయోగమేనా?

- దశాబ్దాలు వృథాగా ఆయిల్‌సీడ్ గోదాములు
- శిథిలావస్థకు చేరినా పట్టించుకోని అధికారులు
- పెచ్చులూడుతున్న భవనాలు
- ధాన్యం నిల్వలకు ఉపయోగంలోకి తేవాలని కోరుతున్న రైతులు



రామాపురంలో నిరుపయోగంగా ఆయిల్ సీడ్ గోదాం

శాంతినగర్: దశాబ్దాల క్రితం ఆయిల్ సీడ్ గ్రోయర్స్ పేరట నిర్మించిన గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన వేరుశనగ ధాన్యాన్ని నిల్వ చేసి ఎర్రవల్లి ఆయిల్ మిల్‌కు తరలించేందుకు 30 ఏళ్ల క్రితం గోదాములు నిర్మించారు. నియోజకవర్గంలో ఎంపిక చేసిన గ్రామాల్లో గోదాములు ఏర్పాటు చేశారు. నేరుగా రైతుల నుంచి వేరుశనగ కొనుగోలు చేసి అటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆయిల్‌మిల్‌కు, ఇటు రైతులకు మేలు జరిగేది. ఆయిల్‌మిల్ ఏర్పాటుతో వందలమందికి ఉపాధి లభించేది. పదేళ్లపాటు వేరుశనగ కొనుగోళ్లు నిర్వహించారు. అనంతరం ఆయిల్‌మిల్ మూసి వేయడంతో రైతుల నుంచి వేరుశనగ కొనుగోళ్లు నిలిపేశారు. దీంతో గోదాములు మూత పడ్డాయి. వందల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. 20 ఏళ్లుగా వాటి నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మరమ్మతు లు చేపట్టకపోవడంతో పైకప్పులు, గోడలు కూలిపోతున్నాయి. ఈ విషయమై ప్రజాప్రతినిధులు స్పందించి నిరుపయోగంగా ఉన్న గోదాములను ఉపయోగంలోకి తెచ్చి ధాన్యం నిల్వలకు అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

లక్షల ప్రజాధనం వృథా..

ఆయిల్ సీడ్ గోదాముల లక్ష్యం నెరవేరకపోవడంతో లక్షల్లో ప్రభుత్వ వ్యయం వృథాగా మారింది. నియోజకవర్గంలో సుమారు 35 గోదాములు నిర్మించారు. గోదాముల నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో అనుకున్న లక్ష్యం నెరవేరకపోగా గోదాములు మాత్రం అటు ప్రభుత్వానికి ఇటు రైతులకు ఉపయోగపడడంలేదు.

శిథిలావస్థకు చేరిన గోదాములు

30 ఏళ్ల క్రితం నిర్మించిన గోదాములకు మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఆయా గ్రామాల్లో నిర్మించిన గోదాముల పైకప్పులు కూలిపోయాయి. కొన్ని గ్రామాల్లో నిర్మించిన గోదాములను స్థలదాతలు తొలగించారు. దీంతో వాటి నిర్మాణ లక్ష్యం నీరుగారిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రైతులకు కేటాయిస్తే బాగుంటుంది..



రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి గ్రామాల్లో గోదాములు లేక ఇబ్బందులకు గురవుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో నిర్మించిన ఆయిల్‌సీడ్ గోదాములకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తెస్తే రైతులకు మేలు అవుతుంది. ధరలు లేని సమయంలో ధాన్యం నిల్వ చేసుకోడానికి ఉపయోగపడతాయి.

– కిట్టు, రైతు, రామాపురం, వడ్డేపల్లి

రూ.వేలు వెచ్చించాలి



గ్రామాల్లో గోదాములు లేనందున సుదూర ప్రాంతాల్లోని ప్రైవేటు గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకోవాల్సి వస్తోంది. గోదాములకు ధాన్యం తరలించడానికి ట్రాక్టర్ల ఖర్చుతోపాటు నెలనెలా వేల రూపాయాలు అద్దె చెల్లించాలి. ప్రభుత్వ గోదాములు ఉపయోగంలోకి తెస్తే రైతులకు మేలు చేసినట్లవుతుంది.

– మద్దిలేటి, రైతు, సాతర్ల, ఇటిక్యాల

రామాలయ అక్షితల శోభాయాత్ర



కేటీదొడ్డిలోని అక్షితల శోభాయాత్ర



చెన్నిపాడులో అక్షితలతో గ్రామ పెద్దలు

కేటీదొడ్డి: అయోధ్య రామాలయ అక్షితల శోభాయాత్ర శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్ విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అక్షితలు తీసుకున్నారు. గద్వాల నుంచి తీసుకొచ్చిన అక్షితలు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుండి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్షి తలు, కలశాలకు మహిళలు మంగళహారతులు ప ట్టారు. జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభం కానునన్నందున ప్రతిష్టాపన అక్షితలు దే శం నలుమూలల నుంచి భక్తులను ఆహ్వానించేందుకు అక్షితలను ప్రతి కుటుంబానికి అందిస్తారని తెలిపారు. వీరన్న, రాఘవ, రాఘవేంద్ర, రామకృష్ణ, జయసింహ, పెద్ద వీరన్న పాల్గొన్నారు.

మానవపాడు: అయోధ్య రామ మందిర అక్షితలు మండలంలోని చెన్నిపాడుకు చేరుకున్న సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మద్దిలేటి, కాటిక వెంకటేశ్వర్లు, చాకలి కృష్ణల, శేఖర్, మాల కృష్ణ, లక్ష్మినారాయణ, పురుషోత్తం, కుర్మన్న, వెంకటేష్, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వనం.. కళాహీనం

గద్వాల పట్టణంలో అహ్లాదం పంచాల్సిన పట్టణ ప్రకృతివనం నిర్వాహణ లేక కళాహీనంగా మారుతున్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో పచ్చదనం మటుమాయమై పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. మరోవైపు కనీసం నీళ్లు పట్టేవారు లేక పోవడంతో పలుచోట్ల మొక్కలు ఎండిపోగా, మరికొన్ని చోట్ల ఏకంగా ప్రకృతి వనాలకు తాళాలు వేసి మూసేశారు. పార్కుల నిర్వాహణకు బాధ్యులు లేక కళహీనంగా మారాయి ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– గద్వాల అర్బన్





వీవర్స్ కాలనీలోని పట్టణ ప్రకృతివనంలో పెరిగిన పిచ్చిమొక్కలు